క్లుప్తంగా

జిరాక్స్ మిషన్ పంపిణీ



జిరాక్స్ మిషన్ అందిస్తున్న సురేందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.20వేల విలువైన జిరాక్స్ కమ్ స్కానర్ మిషన్‌ను అదే గ్రామానికి చెందిన వైద్యులు దామోదర్‌రెడ్డి కుమారుడు కార్డియాలజిస్టు విక్రమ్‌రెడ్డి సమకూర్చారు. శనివారం సదరు మిషన్‌ను గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి ద్వారా పాఠశాలలో అందజేశారు. వారికి ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. దీంతో విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని పలువురు భిక్షాటన చేసేవారికి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మానవసేవే మాధవ సేవ ఉద్దేశంతో సేవా సమితి ద్వారా యాచకులకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు సమితి సభ్యుడు పాల గంగాధర్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మడిగెల గంగాధర్, భక్తులు ఉన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రా మంలోని 23 నంబర్ జీసీసీ రేషన్ దుకాణాన్ని శనివారం ఎంపీపీ మోహిద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు పరిశీలించి సరుకుల సరఫరా, తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో దామెర శ్రీనివాస్, డీలర్ ఎల్లయ్య ఉన్నారు.

బీడీ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

భైంసాటౌన్: ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదివే బీడీ కార్మికుల పిల్లలు ప్రభుత్వం అందించే బీడీ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చే సుకోవాలని ట్రస్మా పట్టణ గౌరవాధ్యక్షుడు జాదవ్ పుండలిక్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి ను ంచి నాలుగో తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.వెయ్యి, ఐదు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.1,500, 9,10 తరగతి విద్యార్థులకు రూ.రెండువేలు స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొ న్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి

కడెం: గ్రామపంచాయతీ కార్యాలయాలు, ఆలయాలు, రికార్డుల్లో లేని అనధికారిక విద్యుత్ కనెక్షన్లకు వెంటనే విద్యుత్ మీటర్లు బిగించుకోవాలని ఆ శాఖ ఏఈ తుమ్మనపల్లి సుమన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో మాట్లాడారు. విద్యుత్ చౌర్యం, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సంస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. వినియోగదారులు కనెక్షన్లను రెగ్యులరైజ్ చేసుకుని నాణ్యమైన విద్యుత్ పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులపై గ్రామసభలు



బూరుగుపల్లి(జి)లో మాట్లాడుతున్న టీఏ

నర్సాపూర్(జి): మండలంలోని నర్సాపూర్(జి), చాక్‌పల్లి, బూరుగుపల్లి(జి) గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో శని వారం ఉపాధిహామీ పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పనుల ప్రణాళిక, పనుల గుర్తింపు, లేబర్ బడ్జెట్ ఆమోదం కోసం గ్రామసభల్లో తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాంరెడ్డి, నస్రీన్‌బేగం, విఠాబాయి, ఏపీఓ సుగుణ, టెక్నికల్ అసిస్టెంట్లు రవీందర్, సతీశ్, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'ఆంక్షలు ఎత్తేయడం హర్షనీయం'

ఖానాపూర్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ధర్నా చౌక్‌పై ఆంక్షలు ఎత్తివేయడం హర్షనీయమని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కులను కాలరాసిన గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు.

మొక్కు చెల్లించుకున్న భక్తులు

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి గెలిచినందుకు మండలంలోని చామన్‌పెల్లి మహిళలు.. తమ గ్రామంలోని రామాలయం నుంచి జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయానికి కాలినడకన వెళ్లి శనివారం మొక్కు తీర్చుకున్నారు. తాము మొక్కుకున్నట్లు చామన్‌పెల్లి నుంచి నిర్మల్‌కు కాలినడకన వెళ్లి ఆలయంలో పూజలు చేసినట్లు 12 మంది మహిళలు తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగు మందుల పిచికారీలో రైతులు జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్



లోకేశ్వరంలో మక్కకు మందు పిచికారీ చేస్తున్న రైతు

లోకేశ్వరం: సస్యరక్షణలో భాగంగా పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ తెలిపారు. జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గాలికి ఎదురుగా రసాయన ఎరువులు చల్లడం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయకూడదని సూచిస్తున్నారు.

కొనుగోలు, పిచికారీ సమయంలోజాగ్రత్తలు..

- పంటలకు చీడపీడలు, తెగుళ్లు ఆశించినపుడు వాటి నివారణకు ఏయే రకం మందులు వాడాలో వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనలను పాటించాలి.
- వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన మందులనే కొనుగోలు చేయాలి. వారు చెప్పిన మోతాదులోనే పంటలపై పిచికారీ చేయాలి.. ఎక్కువైనా, తక్కువైనా నష్టమే.
- పురుగుమందు డబ్బాలతో వచ్చే చీటీల్లోని సూచనలను పాటించాలి. కల్తీ మందో కాదో తెలుసుకోవడం, గడువు తేదీ దాటిందో లేదో చూసుకొని వినియోగించాలి.
- నోటితో డబ్బాల మూతలు తీయకూడదు. మందును చేతులతో కాకుండా కర్రతోనే కలపాలి. కొలతల ప్రకారం మందును పంటలకు వినియోగించాలి
- పూర్తిస్థాయిలో దుస్తులు ధరించాలి. ముఖానికి పలుచటి వస్త్రం కట్టుకోవాలి. లేదా ముక్కుకు మాస్కు పెట్టుకోవాలి. లేకుంటే మందు నోరు, కళ్లలో పడి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఎక్కువ. హెల్మెట్ ధరిస్తే మరీ మంచిది. చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో ఆహార పదార్థాలు, గుట్కా తినడం, నీళ్లు తాగడం, బీడీలు కాల్చడం వంటి పనులు చేయరాదు.
- పంటలపై సమంగా మందు పడేలా పిచికారీ చేసుకోవాలి. ఆకుల భాగం తడవాలి.
- పురుగుమందుల ఎంపిక దగ్గర నుంచి వాటిని చల్లే వరకు ప్రతీ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే మందుల విషప్రభావంతో ఎదురయ్యే సమస్యలను నియంత్రించవచ్చు.
- మందు పిచికారీ చేసిన చేన్లకు పశువులను దూరం ఉంచాలి

భద్రపరిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందు డబ్బాలను వినియోగం తర్వాత ఇతర పనులకు వాడరాదు. భూమిలో పాతిపెట్టాలి. పిచికారీ పూర్తయిన తర్వాత స్ప్రేపంపు, విడిభాగాలను శుభ్రం చేయాలి.
- వినియోగం తర్వాత డబ్బాల మూతలను గట్టిగా బిగించాలి. ఎక్కువ విషప్రభావం కల్గిన మందు డబ్బాలను విడిగా ఉంచాలి.
- మందు కొన్నప్పుడు ఏయే డబ్బాలో ఉందో అందులోనే ఉంచాలి వేరే డబ్బాలోకి మార్చరాదు.
- తినే పదార్థాలు, మేత విత్తనాలు, నీళ్లు ఉన్న గదిలో పురుగుమందులను నిల్వ చేయరాదు.
- గాలి వెలుతురు ఉన్న చోట ఎండ, అగ్గి తగలని చోట ఉంచాలి.
- పురుగు మందులను.. తెగులు, కలుపు నివారణ మందుల నుంచి వేరుగా ఉంచాలి.

స్నానం చేసిన తర్వాతే ఆహారం తీసుకోవాలి..

రసాయన ఎరువులు చల్లేటప్పుడు, క్రిమిసంహారక మందుల పిచికారీ సమయంలో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దు. పిచికారీ అయిన తర్వాత రైతు శుభ్రంగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి. స్నానం అయిన తర్వాతే ఆహార పదార్థాలు తీసుకోవాలి. అలసటకు గురైనట్లు అన్పించినా.. కళ్లు తిరిగినా వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలి.

గ్రామాల్లో పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో శివకృష్ణ

కుంటాల: ఆదాయం పెంచుకునేందుకు గ్రామపంచాయతీల్లో సకాలంలో పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామపంచాయతీ–పరిపాలనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని అన్నారు. పారిశుద్ధ్యం, హరిత హారం, నర్సరీల్లో మొక్కల పెంపకం అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, కార్యదర్శులు పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఉన్న మాల కులసంఘానికి చెందిన ప్లాట్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, కులసంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాలనీలోని కులసంఘ సభ్యులకు తెలియకుండా జంజరుదొడ్డిగా ఉన్న ప్లాట్‌ను అక్రమంగా ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారో సమాధానం చెప్పాలన్నారు. సతీశ్‌రావు, గంగాధర్, సురేశ్, శంకర్, గంగన్న, నేత శ్యాం, రాజశేఖర్, ఎర్రన్న, రాజన్న, సతీశ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

అవార్డు అందుకున్న 'వాసవి' ప్రిన్సిపాళ్లు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాళ్లు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి విద్యాసంస్థలకు అరుదైన అవార్డు దక్కింది. బ్రెయిన్ ఫీడ్ అనే సంస్థ వారి ట్రయల్ బ్లేజర్ స్కూల్ ఎక్స్‌లెంట్ అవార్డును వాసవి విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లకు అందించారు. శనివారం హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు రాజకుమార్, శ్రీనివాస్‌శెట్టి, సుహాసిని, శైలజాయ్యస్ అందుకున్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలకు ఈ అవార్డు లభించినట్లు వాసవి విద్యాసంస్థల కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించం

- డీఆర్డీవో విజయలక్ష్మి
- తానూరు మండలంలో రూ.62,781 రికవరీకి ఆదేశాలు



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

తానూరు: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం తానూరులో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 13వ విడత ప్రజావేదికలో డీఆర్డీవో పాల్గొని మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో రూ.7.85 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. గ్రామాల వారీగా చేపట్టిన పనుల వివరాలను ప్రజావేదికలో చదివి విన్పించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించి రూ.62,781 నిధులు దుర్వినియోగం అయ్యాయని.. వాటిని రికవరీ చేయాలని ఉపాధిహామీ సిబ్బందిని డీఆర్డీవో ఆదేశించారు. అర్హులైన కూలీలకు జాబ్‌కార్డులు అందించి పనులు కల్పించాలని సూచించారు.

నివేదికలు ఇలా ...

బెల్‌తరోడాలో రెండేళ్ల కిందట నర్సరీలో వన సంరక్షకునికి చెల్లించాల్సిన రూ.69,870ను అధికారులు ఇప్పటికీ చెల్లించలేదని సర్పంచ్ సాయినాథ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే డబ్బులు అందేలా చూడాలని డీఆర్డీవో అధికారులను ఆదేశించారు. జౌలా(బి)లో సాగు చేసిన పశుగ్రాసం డబ్బులు అందలేదని రైతు రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, భైంసా ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డ్రైవర్లు, యజమానులు

ఖానాపూర్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ప్రైవేట్ వాహనదారులు, డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతూ పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విధానాలతో నష్టపోయిన వారికి నెలకు రూ.15వేలు చెల్లించాలని డ్రైవర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పరిమల్ భౌమిక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేశ్, ఎస్.విజయ్, పిట్టల రంజిత్, పుల్కం భీమేశ్, వెంకట్రాములు, సంతోష్, రాము, ఇర్ఫాన్, షేక్ షఫీ, నాలం అశోక్, అక్రమ్, అతిక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో స్వాములు

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయ ఆవరణలో శనివారం ముధోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ కనుల పండువగా నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ అయ్యప్ప సేవా సమితి ఆలయ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రాజుగురుస్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాభిషేకం చేశారు. ముందుగా అయ్యప్ప, వినాయకుడు, సుబ్రహమణ్యస్వామి చిత్రపటాలను అలంకరించి పదునెట్టంబడి నిర్వహించారు. స్వాముల భజనలతో మారుమోగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి స్వాములు తరలివచ్చారు.

పాఠశాలల్లో పోషకుల సమావేశం



ముధోల్: చించాల పాఠశాలలో సమావేశంలో పాల్గొన్న పోషకులు



సోన్: న్యూవెల్మల్‌బొప్పారంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం విద్యాసాగర్

లక్ష్మణచాంద: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. బాబాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో ఎంఈవో మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ప్రతి నెలలో మూడో శనివారం తప్పనిసరిగా సమావేశం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులు వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికల గురించి వారి తల్లిదండ్రులతో చర్చించి అవసరమైన సూచనలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇంటింటా చదువుల పంట మొబైల్ యాప్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తరగతులను పునఃప్రారంభించాలి

ముధోల్: మండలంలోని చించాల గ్రామ పాఠశాలలో తరగతులను పునఃప్రారంభించాలని గ్రామస్తులు, పోషకులు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల పోషకుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో తరలించిన తరగతులను తిరిగి ఇదే పాఠశాలకు రప్పించాలని తీర్మానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కె.రాజిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ శంకర్, పోషకులు తదితరులున్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, సర్పంచ్ అంకం గంగామణి మాట్లాడారు. పోషకులు మాట్లాడుతూ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు లేవని.. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని హెచ్‌ఎంను, అధికారులను నిలదీశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం కోసం రూ.3లక్షలు మంజూరయ్యాయని.. ఎన్నికల కోడ్ ఉన్నందున పనులు చేపట్టలేదని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యంతోపాటు మధ్యాహ్న భోజనం సరిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ అంకం జ్ఞానేశ్వర్, వీడీసీ సభ్యులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



ఖానాపూర్ : మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలుకుతున్న మహిళలు



దత్తాత్రేయస్వామి పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రం మల్లన్నగుట్టలో ఉన్న శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయ 13వ వార్షికోత్సవం శనివారం కనుల పండువగా సాగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి పంచామృతాభిషేకం, కుంకుమపూజలు, నూతన వస్త్రాలంకరణ, ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేడుకల్లో ఆలయ కోశాధికారి గురుస్వామి మూర్తి, శంకర్ యాదవ్, సుంకరి మహేశ్, అభిలాష్, స్వామి, రామకృష్ణ, రంజిత్, అరుణ్, శ్రీధర్ పాల్గొన్నారు

చింతల్‌పేట్ దత్తాత్రేయస్వామి ఆలయంలో..

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతలపేట్ గ్రామంలో దత్తాత్రేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. బొమ్మెన రాజశేఖర్‌శాస్త్రి, సతీశ్ ఆధ్వర్యంలో కాగడ హారతి, నవరస అభిషేకం, పల్లకీసేవ, తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం జాతర, అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న వాణివిద్యానికేతన్ ప్రాంగణంలో నేటి నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక గోదాగోష్ఠి నిర్వాహకుడు, అర్చకుడు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 16న రాత్రి 12:30గంటలకు శ్రావణ నక్షత్రంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామి పల్లకిసేవ



పల్లకిసేవలో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతనమైన దేవరకోట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. ఆలయానికి నిర్మల్‌కు చెందిన చిటికేసి రమేశ్, ఆయన కుమారుడు శ్రీనివాసులు రూ.లక్ష నగదును విరాళంగా అందించారు. ఈవో రవికిషన్ , కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకోట ఆలయంలో ఈనెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటలకు భక్తులు ఆలయానికి చేరుకుని తిరుప్పావై ప్రవచనాలు వినాలని కోరారు. వచ్చే శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

పశువైద్య శిబిరం

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 71 గేదెలు, 69 ఆవులకు వైద్య పరీక్షలు చేసి ఎఫ్‌ఎండీ, డీవార్మింగ్ చేసినట్లు పశువైద్యాధికారి రాజేశ్వర్ తెలిపారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర శివ, గణేష్, సీఆర్పీ ప్రతినిధి రాథోడ్ గణపతి, పలువురు సిబ్బంది ఉన్నారు.

పార్డి(బి)లో..

కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ తూము పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. గోపాలమిత్ర గోపాల్, రిలయన్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది అవినాష్, వివేక్, జీవన్ తదితరులు ఉన్నారు.

ధ్యాన శిబిరం వినియోగించుకోవాలి

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతలపేట్ గ్రామంలోని విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రంలో 10 నుంచి 18 ఏళ్ల కల్గిన బాలబాలికలకు ప్రతి నెలా నాలుగో ఆదివారం ఉచిత శిక్షణను అందిస్తామని కేంద్రం నిర్వాహకుడు సాయిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లల్లో భయం , ఆందోళన తగ్గించేందుకు అనపాన ధ్యాన కోర్సులను అందిస్తున్నామని అన్నారు. పూర్తి వివరాలకు 84999 85115లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా విజయ్ దివాస్

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం విజయ్ దివాస్ నిర్వహించారు. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధ సమయంలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైనికుల వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామినీ వివరాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో తడపాకల రాజన్న అనే రైతు ఇటీవల మృతి చెందాడు. శనివారం ఏఈవో పవిత్ర మృతుడి ఇంటికి వెళ్లి నామినీ వివరాలు సేకరించారు. త్వరగా బీమా డబ్బులు వచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.